తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | శుక్రవారం | 05 - 06 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజిలు : 1

# మోత్కూరు చేనేత సహకార సంఘం మేనేజర్ పై విచారణ

ప్రజావారధి ఎఫెక్ట్

- బహిరంగ విచారణ చేపట్టిన జిల్లా అధికారులు
- మేనేజర్ నర్సయ్య అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేసిన నాయకులు, కార్మికులు
- డబ్బులివ్వనిదే ఏ పథకం, ఏ పని చేయడన్న కార్మికులు
- మేనేజర్‌కు లంచం ఇచ్చిన కార్మికుల వాంగ్మూలం తీసుకున్న అధికారులు
- అధికారులను బహిరంగ విచారణకు రాకుండా అడ్డుకున్న మేనేజర్
- కలెక్టర్, చేనేత ఏడీకి రిపోర్ట్ ఇస్తామన్న అధికారులు





ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు చేనేత సహకార సంఘం మేనేజర్ వేముల నర్సయ్యపై చేనేత, జౌళిశాఖ జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. సంఘం ఏళ్లుగా పాతుకపోయిన మేనేజర్ నర్సయ్య అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని, ఏ పథకం అందాలన్నా, ఏ పని చేయాలన్నా లంచం ఇవ్వనిదే పని చేయడం లేదని, సంఘం ఆస్తులు, ఆర్థిక లావాదేవీలు, సంఘం భవనాల ద్వారా వస్తున్న కిరాయిలను కార్మికులకు చెప్పకుండా రహస్యంగా ఉంచడంపై ప్రజావారధి గత నెల 8న మోత్కూరు చేనేత సహకార సంఘంలో మోనార్క్ కథనంతో సంఘంలో జరుగుతున్న అక్రమాలు, మేనేజర్ నర్సయ్య వసూళ్ల పర్వాన్ని వెలుగులోకి తెచ్చింది. పద్మశాలి సంఘం నాయకులు, చేనేత కార్మికులు కూడా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన చేనేత, జౌళిశాఖ యాదాద్రి ఏడీ మేనేజర్ నర్సయ్యపై విచారణకు ఆదేశించారు. జిల్లా అధికారుల ఆదేశంతో గురువారం చేనేత, జౌళిశాఖ జిల్లా డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.రాజేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఏలూరు సచిన్ మోత్కూరు పద్మశాలి కాలనీలో కార్మికులతో బహిరంగ విచారణ చేపట్టారు. చేనేత బీమా, చేనేత రుణమాఫీ, త్రిఫ్ట్ స్కీం, మగ్గాల జియో ట్యాగింగ్ పథకాల కోసం కార్మికుల నుంచి మేనేజర్ నర్సయ్య వసూళ్లపై అధికారులు అడగ్గా డబ్బులిచ్చిన కార్మికులు ఎవరెవరు ఎంత ఇచ్చారన్నది వాంగ్మూలం ఇచ్చారు. పలువురు నర్సయ్యకు చేసిన ఫోన్ పే, గూగుల్ పే చూపించారు. ఏ పథకం, ఏ పని కోసం ఎవరెవరు ఎన్ని డబ్బులిచ్చారన్నది అధికారులు రికార్డ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఏదైనా పనికోసం సంఘం కార్యాలయంకు వెళితే ప్రతి పనికి రేటు కట్టి డబ్బులడిగేవాడని, డబ్బులివ్వకుంటే పథకాలు ఊరకనే వస్తాయా అంటూ నోటికొచ్చినట్టు బూతులు తిడతాడని పలువురు కార్మికులు వాపోయారు. సుమారు 30 ఏళ్లుగా సంఘంలో పాతుకపోయిన నర్సయ్య కొందరు సంఘం నాయకులను అడ్డం పెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని, సంఘాన్ని చెరబట్టి సంఘం ఆస్తులను తన స్వంత ఆస్తుల్లా వ్యవహరిస్తున్నాడని, సంఘం ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయ వనరుల లెక్కలు చెప్పడం లేదని పద్మశాలి సంఘం నాయకులు తెలిపారు. మేనేజర్ నర్సయ్యను తొలగించి సంఘాన్ని ప్రక్షాళన చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర కమిషనర్, మంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. మేనేజర్ నర్సయ్యపై చర్యలు తీసుకునే విధంగా పూర్తి ఆధారాలతోకలెక్టర్, జిల్లా ఏడీకి నివేదిక ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం పద్మశాలి సంఘం నాయకులు మోత్కూరు పట్టణంలో సంఘంకు ఉన్న ఆస్తులు, భవనాల్లో నడుస్తున్న షాపులను అధికారులకు చూపించి వాటి ద్వారా వస్తున్న కిరాయిల వివరాలను అధికారులకు వివరించినట్టు తెలిసింది.



## అధికారులను బహిరంగ విచారణకు రాకుండా అడ్డుకున్న మేనేజర్

విచారణ కోసం వచ్చిన జిల్లా అధికారులు బహిరంగ విచారణ కోసం పట్టణంలోని పద్మశాలి కాలనీకి వెళ్లకుండా మేనేజర్ నర్సయ్య అడ్డుకున్నట్టు తెలిసింది. విచారణ కోసం వచ్చిన జిల్లా అధికారులు భువనగిరి రోడ్డులో ఉన్న సంఘం కార్యాలయం వద్దకు రాగా మేనేజర్ నర్సయ్య తనకు అనుకూలంగా ఉండే చేనేత నాయకులను అక్కడకు పిలిపించి అధికారులను సముదాయించేలా మాట్లాడించినట్టు తెలిసింది. పత్రికలో వచ్చిన కథనం, కార్మికులు చేసిన ఫిర్యాదుపై విచారణ కోసం పద్మశాలి కాలనీకి వెళ్లకుండా చాలాసేపు అక్కడే అడ్డుకున్నట్టు పద్మశాలి సంఘం నాయకులు ఆరోపించారు. విచారణ కోసం అధికారులు వస్తారని తెలిసి పద్మశాలీ కాలనీలో కార్మికులంతా గుమికూడగా మోత్కూరు వచ్చిన అధికారులు కాలనీ వరకు రాకపోవడంతో అనుమానం వచ్చిన కొందరు పద్మశాలి సంఘం నాయకులు చేనేత సంఘం వద్దకు వెళ్లగా అధికారులు అక్కడే ఉండటం చూసి వారికి విషయం చెప్పి కాలనీకి తీసుకెళ్లారు. విచారణ కోసం వచ్చిన అధికారులను మేనేజర్ నర్సయ్య సంఘం రికార్డులో ఖాళీ పేపర్‌పై సంతకాలు చేయాలని ఒత్తిడి చేసినట్టు తెలిసింది.